
సాక్షి ఒడిశా

శుక్రవారం । 27 । జూన్ । 2025



శ్రీమందిరం ఆదాయం లెక్కింపు

భువనేశ్వర్: పూరీ జగన్నాథాలయం హుండీలో భక్తుల కానుకల రూపంలో సమర్పించిన ఆదాయాన్ని పాలకవర్గం గురువారం లెక్కించారు. ఇందులో నగదు రూ.3.60.301లు, బంగారం 3గ్రాముల 550 మిల్లీగ్రాములు, వెండి 97 గ్రాముల 200 మిల్లీగ్రాములు వచ్చాయని అధికారులు తెలిపారు.



నేత్రోత్సవం

జగన్నాథుని ఆలయాల్లో నేత్రోత్సవం కన్నుల పండువలా జరిగింది. స్వామి నవయవ్వనుడై కనిపించాడు.

- 8లో



మత్తుతో జీవితాలు చిత్తు

మాదక ద్రవ్య వ్యతిరేక దినోత్సవాలు రాష్ట్రమంతా జరిగాయి. మత్తుతో జీవితాలు చిత్తవుతాయని వక్తలు అన్నారు.

- 8లో

న్యూస్‌రీల్

ఈస్టుకోస్ట్ రైల్వే ప్యానల్ అడ్వకేట్‌గా సంతోష్ మిశ్ర



కొరాపుట్: ఈస్టుకోస్ట్ రైల్వే విభాగ ప్యానల్ అడ్వకేట్‌గా సంతోష్ మి శ్ర నియమితులయ్యారు. గురువారం ఈస్ట్‌కోస్ట్ రైల్వే ఒక ప్రకటనలో ఈ విషయం తెలిపింది. నబరంగ్‌పూర్ జిల్లా కేంద్రానికి చెందిన సంతోష్ ప్రస్తుతం జిల్లా కోర్టులో అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా పని చేస్తున్నారు. ఇకపై నబరంగ్‌పూర్ జిల్లాలో ఈస్ట్‌కోస్ట్ రైల్వే శాఖ తరుపున అన్ని కేసులు వాదించనున్నారు. ప్రస్తుతం నబరంగ్‌పూర్-జయపూర్, నబరంగ్‌పూర్-జునాఘడ్ రైల్వే నిర్మాణాలు జరుగుతున్నాయి. ఈ నిర్మాణాలపై అభ్యంతరాలు తెలుపుతూ అనేక కేసులు నమోదు అవుతున్నాయి. ఈ నేపథ్యంలో తన కేసులు వాదించడానికి సంతోష్‌ని నబరంగ్‌పూర్ జిల్లాలో నియమించింది.

యాత్రికులకు జీవిత బీమా

భువనేశ్వర్: పూరీ శ్రీ జగన్నాథ రథయాత్ర సందర్భంగా భక్తులు, యాత్రికులకు రూ. 5 లక్షల బీమా సౌకర్యాన్ని ప్రభుత్వం ప్రకటించింది. పూరీ మున్సిపల్ ప్రాంతం పరిధిలో జరిగే ప్రమాదాలకు మాత్రమే ఈ బీమా సౌకర్యం పరిమితం. యాత్ర సమయంలో ప్రమాదాలు, అసహజ మరణాలు, తొక్కిసలాటలు, ఉగ్రవాద దాడులు వంటి ప్రమాదాలను పరిగణనలోకి తీసుకుంటారు. ఈ సౌకర్యాన్ని సేవకులు, శ్రీ జగన్నాథ ఆలయ సిబ్బందికి విస్తరింపజేయడం విశేషం.

విద్యుత్ కోతలపై నిరసన



ఆందోళనలో పాల్గొన్న మాజీమంత్రి రమేష్ మజ్జి తదితరులు

కొరాపుట్: విద్యుత్ కోతలను నిరసిస్తూ నబరంగ్‌పూర్ జిల్లా చందాహండి సమితి కేంద్రం విద్యుత్ సెక్షన్ కార్యాలయం ముందు స్థానికులు గురువారం ఆందోళన చేపట్టారు. గ్రామీణ ప్రాంతాల్లో పాడైన స్తంభాలు, వైర్లు మార్చాలని, ప్రతీ పంచాయతీకి ఫీడర్ ఏర్పాటు చేయాలని, స్మార్ట్ మీటర్లు తొలగించి, పాత మీటర్లు పునరుద్ధరించాలని కోరారు. అలాగే అప్రకటిత విద్యుత్ కోతలను ఎత్తివేయాలని, విద్యుత్ శాఖలో ఖాళీలు భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. ఈ ఆందోళనకి సంఘీభావం ప్రకటిస్తూ మాజీ మంత్రి రమేష్ చంద్ర మజ్జి బైఠాయించారు.

రథ యాత్రలో ఉచిత ఆటో సేవలు

భువనేశ్వర్: పూరీ రథయాత్రలో ఉచిత ఆటో సేవల సౌకర్యం కల్పించినట్లు రాష్ట్ర రవాణా, వాణిజ్య శాఖ మంత్రి బిభూతి జెనా తెలిపారు. యాత్రికులకు 200 ఆటోలు ఉచిత సేవలు అందిస్తాయి. దీంతో ఉచిత ఆహారం సరఫరా అవుతుందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ప్రతి జిల్లా నుంచి పూరీ యాత్ర స్థలానికి బస్సు సౌకర్యం అందుబాటులో ఉందన్నారు. పలు ప్రాంతాల నుంచి విచ్చేసే బస్సులు నిలిపేందుకు 28 ప్రదేశాల్లో పార్కింగ్ ప్రాంగణాలు ఏర్పాటు చేశారు.

హత్య కేసులో మరో ఐదుగురు నిందితులు అరెస్టు



అరెస్టైన నిందితులు

రాయగడ: జిల్లాలోని పద్మపూర్ పోలీసులు ఒక హత్యకేసుకు సంబంధించి మరో ఐదుగురు నిందితులను బుధవారం రాత్రి అరెస్టు చేశారు. అరెస్టైనవారిలో జుమురుగుడ గ్రామానికి చెందిన శివ సాహు, సంతోష్ సాహు, అమర్ సాహు, పింకూ సాహు, బుడు పలమలు ఉన్నారు. గతేడాది మే 21వ తేదీన జుమురుగుడ గ్రామంలో నివాసముంటున్న భైరవ సాహు అనే వ్యక్తి చేతబడి చేస్తున్నాడన్న ఆరోపణపై గ్రామంలో కొందరు అత్యంత దారుణంగా మూకుమ్మడిగా దాడి చేసి హత్య చేసిన సంగతి తెలిసిందే. ఈ కేసుకు సంబంధించి అప్పట్లో 21 మందిని పద్మపూర్ పోలీసులు అరెస్టు చేశారు.

కేరళలో గజపతి జిల్లా వలస కూలీ మృతి

పర్లాకిమిడి: గజపతి జిల్లా మోహన బ్లాక్ అడవ పంచాయతీ గరడమా గ్రామనివాసి మహేంద్ర బోలియార్‌సింగ్ (30) పని కోసం కొద్దిరోజుల క్రితం కేరళ రాష్ట్రంలోని ఎర్నాకుళం వెళ్లి ప్రమాదవశాత్తు రైల్వే ట్రాక్ కింద పడి మృతి చెందినట్టు అడవ పోలీసు అధికారికి గ్రామస్తులు ఫిర్యాదు చేశారు. మహేంద్ర బోలియార్‌సింగ్ నుంచి ఎలాంటి సమాచారం గానీ ఫోన్ కాల్ రాకపోవడంతో ఆందోళన చెందుతున్న కుటుంబసభ్యులకు మృతి చెందినట్టు రైల్వే పోలీసుల నుంచి సమాచారం అందింది. దీంతో మహేంద్ర కుటుంబసభ్యులు ఎర్నాకుళం నుంచి మృతదేహాన్ని తీసుకురావాలని బీడీఓను కోరారు.



ఆజ్ఞామాలలతో అర్చకులు



సింహద్వారం వద్దకు చేరిన రథాలు

కనరో భాగ్యము

● నేడే పూరీ రథయాత్ర ● సకల ఏర్పాట్లు సంసిద్ధం

భువనేశ్వర్: శ్రీక్షేత్రంలో ఉత్సవ ఉత్సాహం కనిపిస్తోంది. ఆషాఢ శుక్ల పక్ష ప్రతిపద తిథి పురస్కరించుకుని శ్రీ మందిరంలో మూల విరాట్లు నవయవ్వన రూపంలో గురువారం భక్తులకు దర్శనమిచ్చారు. మరో వైపు శుక్రవారం జరగనున్న యాత్ర కోసం స్వామిని తీసుకుని వెళ్లేందుకు శ్రీ మందిరం సింహ ద్వారం ముంగిటకు చేరాయి. తయారీ ప్రాంగణం నుంచి దక్షిణాభిముఖంగా మూడు కొత్త రథాలు వరుస క్రమంలో శ్రీ మందిరం ముంగిటకు చేరాయి. ఈ యాత్ర ఉభా యాత్రగా సుపరిచితం. అన్న బలభద్ర స్వామి అనుమతితో శ్రీ జగన్నాథుని రథం నందిఘోష్ ముందుగా తయారీ ప్రాంగణం నుంచి బయల్దేరడం విశేషం. వెంబడి సోదరి దేవీ సుభద్ర రథం దర్ప దళనం బయల్దేరింది. చివరగా బలభద్ర స్వామి రథం తాళ ధ్వజం శ్రీ మందిరం వాకిలికి చేరింది. ఈ దర్శనం కోసం భక్తులు తండోపతండాలుగా తరలి వచ్చారు. నవ యవ్వన దర్శనాన్ని ఉభా యాత్రగా పేర్కొంటారు. సాయంత్రం 4.40 గంటలకు మూల విరాట్ల నుంచి ఆజ్ఞా మాలలు చేరడంతో మూడు రథాలు వరుస క్రమంలో లాగడం ప్రారంభించారు. ముందస్తు సన్నద్ధత ప్రకారం పోలీసుల భద్రత వలయాల మధ్య రథాలు సురక్షితంగా ముందుకు సాగాయి.

రాత్రంతా సన్నాహాలు

స్వామి దర్శనం కోసం భక్తులు ఎంతగా తహతహలాడిపోయారో భక్తులకు కనులారా దర్శనం ప్రసాదించేందుకు స్వామి అంతకంటే అధికంగా ఆరాటపడడం అద్భుతం. తెల్లారితే పరిపూర్ణ దర్శనంతో నేత్రోత్సాహం కలిగించేందుకు రాత్రి అంతా స్వామి మేలుకొని ఏకాంత సేవకు దూరమయ్యాడు. స్నాన యాత్ర నుంచి 15 రోజుల విరామం తర్వాత దేవతలు నవయువ వేషంలో భక్తులకు నవ యువకునిగా దర్శనం ఇచ్చేందుకు శ్రీ ముఖ అలంకరణ (బొనొకొ లగ్గి)లో తలమునకలయ్యాడు. ఒణొసొరొ చతుర్దశి, ఆషాఢ అమావాస్య తిథి నాడు ఆలయ సంప్రదాయ నియమాల ప్రకారం దత్త మహాపాత్రో సేవకులు మూల విరాట్లకు శ్రీ ముఖ సేవతో నవ యవ్వనంగా తీర్చిదిద్దారు. అనంతరం నవయువ దర్శనం సన్నాహాలు ప్రారంభించారు. రథాల పైకి వెళ్లే ముందు శ్రీ మందిరంలో ఆకర్షణీయమైన అలంకరణలో చతుర్ధామూర్తులను దర్శించుకోవడం అపురూప అవకాశంగా భక్తులు భావిస్తారు. భక్తులు పెద్ద సంఖ్యలో తరలి వచ్చారు. శ్రీ మందిరం దక్షిణ ద్వారం గుండా దర్శనానికి అనుమతించారు. తొలి గంట పరకామణి దర్శనం కల్పించారు. ఆ తర్వాత సర్వ దర్శనానికి అనుమతించారు. సాయంత్రం 7 గంటల వరకు స్వల్ప అంతరాయంతో భక్తులకు దర్శనమిచ్చారు.

చిత్ర పటాల తొలగింపు

భారీ స్నానంతో స్వామి అస్వస్థతకు గురి కావడంతో తెరమరుగైన 15 రోజులపాటు ప్రధాన దేవతల ప్రతీకగా దర్శనం ఇచ్చిన చిత్ర పటాల దేవుళ్లను ముందుగా తొలగించారు. చిత్ర పటాలతో పూజలందుకున్న శ్రీ జగన్నాథుని ఉత్సవ మూర్తి మదన మోహనుడు, డోల గోవిందుడు, బలభద్రుని ఉత్సవ మూర్తులు రామకృష్ణులు, నృసింహుని దక్షిణ గృహానికి తరలించారు. శ్రీ దేవి, భూదేవి ఉత్సవ మూర్తుల్ని శయ్యా గృహానికి తరలించారు. అనంతరం బలభద్ర స్వామి ప్రతీక రూపం అనంత వాసుదేవుడు, శ్రీ జగన్నాథుని ప్రతీక చిత్రపట దేవుడు అనంత నారాయణుడు, దేవీ సుభద్ర ప్రతీకగా పూజలందుకున్న భువనేశ్వరి చిత్రటాలను విమలా దేవి ఆలయం సమీపంలో మొండొణి గృహానికి తరలించారు. తెరలు తొలగడంతో చివరగా దేవతలు చికిత్స పొందిన ప్రాంగణంలో మంచం వగైరా తొలగించి కడిగి సున్నం నీరు చిమ్మి శుద్ధి చేశారు. కొఠొ సుంవాసియా సేవకులు ఈ పనుల్లో పాలుపంచుకోవడం ఆచారం. ఈ తంతు అంతా ముగిసే సరికి తెల్లారి పోవడంతో బుధవారం రాత్రి అంతా మెలకువగానే ఉండాల్సి వచ్చింది. నిర్విరామంగా భక్తులకు కనులారా దర్శనం ప్రసాదించి నేత్రోత్సవం జరుపుకున్నాడు.

నేడు రథ యాత్ర

స్వామి పూర్తిగా కోలుకుని నవ యువకుని ఉత్సాహంతో యాత్రకు సిద్ధమయ్యాడు. యాత్ర కోసం రథాలు సర్వాంగ సుందరంగా రూపుదిద్దుకుని స్వామి రాక కోసం నిరీక్షిస్తున్నాయి. స్వామి తెరమరుగున ఉన్న రోజుల్లో వేధించిన ఉక్కపోత వాతావరణం సానుకూలంగా మారింది. అదే సమయంలో వరుణ దేవుడు కరుణించే సంకేతాలు లభిస్తున్నాయి. వాతావరణ శాఖ సమాచారం ప్రకారం, రాష్ట్రంలోని కొన్ని ప్రాంతాల్లో శుక్ర వారం భారీ నుంచి అతి ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షాలు, ఉపరితల గాలులు వీచే అవకాశం ఉంది. పూరీలో కూడా ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం పడే అవకాశం ఉందని ఈ కేంద్రం ముందస్తు సమాచారం జారీ చేసింది. ఉపరితల గాలుల వేగం గంటకు 30 నుంచి 40 కిలో మీటర్ల వరకు ఉంటుందని అంచనా.



రథాలు సిద్ధం



భద్రత వలయంలో..

సింహద్వారం ముంగిటకు రథాలు

రథయాత్ర కోసం మూడు రథాలు శ్రీమందిరం సింహద్వారం ముంగిటకు సురక్షితంగా చేరాయి. రథాలపైకి మూల విరాటులు తరలించేందుకు వీలుగా అమర్చాల్సిన చారుమళ్లు, రథాలు లాగేందుకు అవసరమైన తాళ్లు తదితర సామగ్రి రథాల ప్రాంగణానికి చేరాయి. రథాల వద్ద పటిష్ట భద్రత ఏర్పాటు చేశారు. సాయంత్రం 5.00 గంటలకు రథాల తయారీ ప్రాంగణం నుంచి బయల్దేరిన శ్రీజగన్నాథుని నందిఘోష్ రథం సాయంత్రం 5.40 గంటలకు, తర్వాత సాయంత్రం 5.54 గంటలకు బయల్దేరిన సుభద్ర రథం దర్ప దళనం సాయంత్రం 6.26 గంటలకు, చివరగా సాయంత్రం 6.37 గంటలకు బయల్దేరిన బలభద్రుని తాళధ్వజం రాత్రి 7.15 గంటలకు శ్రీమందిరం సింహద్వారం ముంగిటకు చేరాయి.

రథ యాత్ర షెడ్యూల్

కార్యక్రమం	సమయం
మంగళ హారతి	ఉదయం 6
మైలం	ఉదయం 6.10
తాడొపా లగి	ఉదయం 6.30
రోష హోమం	ఉదయం 6.30
ఒబొకాషొ	ఉదయం 7
సూర్య పూజ	ఉదయం 7.10
ద్వారపాలకులు పూజ	ఉదయం 7.30
అలంకరణ ముగింపు	ఉదయం 7.30
గోపాల బహావల్లభ, ప్రాతః ధూపం (ఖేచుడి భోగం)	ఉదయం 8 నుంచి 9 గంటల వరకు
రథ ప్రతిష్ఠ	ఉదయం 9
మంగళార్చన	ఉదయం 9. 15
పాహండి ప్రారంభం	ఉదయం 9.30
పాహండి ముగింపు	మధ్యాహ్నం 12.30
శ్రీ మదన మోహన్, శ్రీ రామ, శ్రీ కృష్ణ విజే	మధ్యాహ్నం 12.30 నుంచి 1 గంట వరకు
చిత్తా లగి	మధ్యాహ్నం 1.30 నుండి 2 గంటల వరకు
అలంకరణ ముగింపు	మధ్యాహ్నం 1.30 నుండి 2.30 గంటల వరకు
ఛెరా పాహరా	మధ్యాహ్నం 2.30 నుంచి 3.30 గంటల వరకు
చారుమళ్ల తొలగింపు, గుర్రాలు, సారథుల అమరిక	సాయంత్రం 4
రథ యాత్ర ఆరంభం	సాయంత్రం 4

రోడ్డు మీద నాట్లు



రోడ్డు మీద మెక్కలు నాటుతున్న గిరిజన మహిళలు



రోడ్డు దుస్థితి



నిరసనలో గిరిజన మహిళలు

కొరాపుట్: అధ్వాన స్థితిలో ఉన్న రోడ్డు పరిస్థితిని వివరిస్తూ గిరిజనులు మొక్కలు నాటి నిరసన తెలిపారు. గురువారం కొరాపుట్ జిల్లా బొరిగుమ్మ సమితి నారిగాం పంచాయతీ రాం పాత్రపుట్ గిరిజన మహిళలు ఇలా వినూత్న నిరసన తెలిపారు. గ్రామానికి ప్రభుత్వం రోడ్డు మంజూరు చేసినా కాంట్రాక్టర్ సగంలో ఆపి వెళ్లిపోవడంతో రోడ్డు మరింత దారుణంగా మారింది. ఇటీవల పలు ప్రమాదాలు కూడా జరిగాయి. దీంతో ఆ గ్రామ గిరిజనులు రోడ్డు మీద మెక్కులు నాటి నిరసనకు దిగారు.

ఉత్కళమణి ఆదర్శాలు స్ఫూర్తిదాయకం



ఉత్కళమణి పండిత్ గోపబంధు దాస్ వర్ధంతి సందర్భంగా ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝి శ్రద్ధాంజలి ఘటించారు. ఆయనతో శాసన సభ స్పీకరు సురమా పాఢి, ఉప ముఖ్యమంత్రి కనక వర్ధన్ సింగ్‌దేవ్ పాల్గొన్నారు. శాసన ప్రాంగణంలోని విగ్రహానికి పుష్పగుచ్ఛం సమర్పించి వీరంతా శ్రద్ధాంజలి ఘటించారు.

- భువనేశ్వర్

రథయాత్రకు త్రివిధ భద్రత

- డ్రోన్ వ్యతిరేక వ్యవస్థ విజయవంతం
- శ్రీ జగన్నాథ ధామ్ యాప్ ప్రారంభం



సముద్ర మార్గంలో కోస్టు గార్డుల నిఘా

భువనేశ్వర్: ప్రపంచ ప్రఖ్యాత పూరీ శ్రీ జగన్నాథుని రథయాత్రకు ఎలాంటి ముప్పు వాటిల్లకుండా అధునాతన వ్యవస్థతో పకడ్బందీ భద్రతా ఏర్పాట్లు చేశారు. జల, స్థల, వాయు మార్గాల్లో యాత్ర సమగ్ర పరిసరాలపై నిఘా పెట్టారు. ఇటీవల కాలంలో పూరీ శ్రీ మందిరం శిఖరాన డ్రోన్ సంచారం కలవరపరుస్తోంది. యాత్ర పురస్కరించుకుని ఈ బెడద తలెత్తకుండా అధునాతన డ్రోన్ వ్యతిరేక వ్యవస్థని ప్రవేశ పెట్టారు. పటిష్టమైన ఉగ్రవాద వ్యతిరేక చర్యల కోసం శక్తివంతమైన వాహనాలు తదితర సరంజామాతో నిపుణులైన సిబ్బందిని రంగంలోకి దింపారు. ఈసారి కృత్రిమ మేధస్సుని విస్తారంగా ప్రయోగిస్తున్నారు. ఏఐ అనుసంధానంతో పూరీ పట్టణ వ్యాప్త సీసీటీవీ వ్యవస్థ పర్యవేక్షణ, వాహనాల రవాణా తదితర కార్యకలాపాలు చేపడుతున్నారు. భద్రతా యంత్రాంగంతో యాత్రికులు, సాధారణ ప్రజానీకానికి ఏఐ అనుసంధానం అక్కరకు రానుంది. ఈ ఏడాది తొలి సారిగా ఇంటిగ్రేటెడ్ కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్‌ను ఏర్పాటు చేశారు. రాష్ట్ర పోలీసు డైరెక్టర్ జనరల్ యోగేష్ బహదూర్ ఖురానియా బుధవారం ఈ క్రేంద్రాన్ని ప్రత్యక్షంగా సందర్శించారు. రథ యాత్ర పురస్కరించుకుని పూరీ పట్టణం వాహనాల రవాణాతో రద్దీగా తయారుకాకుండా ప్రత్యేక జాగ్రత్తలు తీసుకున్నారు. రద్దీ పెరుగుదలకు అనుగుణంగా నియంత్రణ చర్యలు చేపట్టేందుకు ఏర్పాట్లు చేశారు. ఈ నేపథ్యంలో ప్రత్యేకంగా క్యూఆర్ కోడ్‌ని జారీ చేశారు. ఈ కోడ్‌ని స్కాన్ చేయడంతో వాహనాల రవాణా తాజా వ్యవస్థని ప్రతి ఒక్కరూ సులువుగా తెలుసుకునేందుకు వీలు కల్పించారు. అత్యవసర పరిస్థితుల్లో సంప్రదింపుల కోసం 112కు డయల్ చేయాలని పూరీ పోలీసు యంత్రాంగం ప్రకటించింది.

డ్రోన్ కూల్చివేత

రథయాత్రకు ప్రతిపాదించిన డ్రోన్ వ్యతిరేక వ్యవస్థని బుధవారం ప్రారంభించారు. ఈ వ్యవస్థ తొలి విజయాన్ని సాధించింది. శ్రీ మందిరం శిఖరం ఆకాశ మార్గంలో సంచరిస్తున్న డ్రోన్ కుప్ప కూలింది. దీన్ని పరిశీలించగా శ్రీ మందిరం దక్షిణ ద్వారం పరిసరాల్లో శ్రీ మందిరంపై చక్కర్లు కొడుతున్నట్లు తేలింది. కొత్తగా ప్రారంభించిన డ్రోన్ వ్యతిరేక వ్యవస్థని దీన్ని కుప్ప కూల్చింది. ఈ వ్యవహారంలో అనుమానిత వ్యక్తుల్ని పోలీసులు అదుపులోకి తీసుకుని ప్రశ్నిస్తున్నారు. కుప్పకూలిన డ్రోన్ స్వాధీనపరచుకుని నిర్వీర్యపరిచారు. దీని ప్రయోగం పూర్వాపరాలపై విచారణ కొనసాగుతుంది. శ్రీ మందిరం ప్రాంగణనం నో ఫ్లయింగ్ జోన్ పరిధిలో ఉన్నందున డ్రోన్ వినియోగం నిషేధంగా పేర్కొన్నారు. తీర ప్రాంతంలో కోస్టు గార్డుల పహరా ఏర్పాట్లు చేశారు. సముద్ర మార్గంలో అవాంఛనీయ, అభ్యంతరకర చొరబాటులు నివారించేందుకు ఈ వ్యవస్థ రాత్రింబవళ్లు పని చేస్తుంది. సాగర తీరంలో కెరటాల్లో కొట్టుకుపోవడం వంటి సంఘటనల నివారణకు ప్రత్యేకంగా శిక్షణ పొందిన లైఫ్ గార్డుల్ని తీరంలో అనుక్షణం అందుబాటులో ఉండేలా నియమించారు.



ఇంటిగ్రేటెడ్ కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్ సందర్శనలో డీజీపీ యోగేష్ బహదూర్ ఖురానియా

శ్రీ జగన్నాథ ధామ్ యాప్

ఈ ఏడాది యాత్ర సందర్భంగా శ్రీ జగన్నాథ ధామ్ మొబైల్ యాప్ ప్రారంభించారు. దీనిలో దర్శన వేళలు, సేవా బుకింగు, వసతి సమాచారం, ఆలయ సేవలు, నిత్య పూజాదులు, దర్శనం కోసం క్యూ తాజా పరిస్థితి, రథ యాత్ర సౌకర్యాలు, అత్యవసర సేవలు సంబంధిత సమాచారం అందుబాటులో ఉంటుంది.



పోలీసులు స్వాధీనపరచుకున్న డ్రోన్ సరంజామా



డ్రోన్ ఎగరవేత వ్యవహారంలో అనుమానిత వ్యక్తులు



పర్యాటకుల రక్షణ కోసం సాగర తీరంలో లైఫ్ గార్డుల మోహరింపు

క్లుప్తంగా

కొత్తవలస-కిరండోల్ రైల్వే లైన్‌లో తాత్కాలిక అంతరాయం



రైల్వే ట్రాక్ మీద ఉన్న బండ రాయి

కొరాపుట్: కొత్తవలస-కిరండోల్ రైల్వే లైన్‌లో తాత్కాలిక అంతరాయం ఏర్పడింది. గురువారం సాయంత్రం కొరాపుట్-అరకు రైల్వే స్టేషన్ల మధ్య దర్లిపుట్ సమీపంలో కొండ చరియ విరిగి ట్రాక్ మీద పడింది. ఇది గమనించిన సిబ్బంది ఆ మార్గంలో వస్తున్న గూడ్స్ రైలుని నిలిపివేశారు. ఆ రాయిని తొలగించిన తర్వాత రైళ్లు యథావిధిగా నడిచాయి.

వంతెన కింద గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం



నదిలో వంతెన కింద మృత దేహం

కొరాపుట్: కొరాపుట్-రాయగడ మధ్య వంతెన కింద గుర్తు తెలియని యువకుని మృతదేహాన్ని వాహనదారులు గుర్తించారు. గురువారం సాయంత్రం చిందిరి సమీపంలో అమింగుడ సమీపంలో చిపాగడ్ వంతెన కింద యువకుని మృతదేహం ఉంది. నదిలో కొట్టుకువచ్చిందా.. ఆత్మహత్యా అనేది పోలీసు దర్యాప్తులో తేలనుంది.

ప్రాణ రక్షణే ప్రథమ కర్తవ్యం: సీఎం



ముఖ్యమంత్రి అధ్యక్షతన విపత్తు నిర్వహణ సమీక్ష సమావేశం

భువనేశ్వర్: విపత్తు సన్నద్ధత కార్యకలాపాలపై ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝి గురువారం సమీక్షించారు. ఆయన అధ్యక్షతన స్థానిక లోక్ సేవా భవన్ కన్వెన్షన్ సెంటరులో సమీక్ష సమావేశం జరిగింది. ప్రకృతి వైపరీత్యాల సమయంలో శూన్య ప్రాణ హాని నిబద్ధతను ముఖ్యమంత్రి పునరుద్ఘాటించారు. విపత్తుల సమయంలో ప్రభుత్వం ప్రజలకు చేరువలో ఉండి సత్వర సహాయం అందజేస్తుందన్నారు. నైరుతి రుతు పవనాలు ప్రభావంతో ఏటా జూన్ నుంచి అక్టోబర్ నెలల్లో వరదలు, తుఫానులు విపత్కర పరిస్థితులు ఊహాతీతమైన ముప్పు కలిగిస్తున్నాయి. ప్రకృతి వైపరీత్యాలు అనివార్యమైనప్పటికీ బలమైన సంసిద్ధత, విభాగాల సమన్వయంతో సమర్థంగా ఎదుర్కొనే సన్నద్ధతతో యంత్రాంగం సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. బలహీనమైన నదీ గట్ల పటిష్టతపై దృష్టి సారించి వరద తీవ్రతని కొంత మేరకు కట్టడి చేయాల్సి ఉంటుంది. మానవ ప్రాణ హాని తరహాలో పాడి పశువులు ఇతరేతర జీవ రాశుల ప్రాణ నష్టం నివారించే దిశలో యంత్రాంగం కార్యాచరణ పటిష్టపరచాలన్నారు. పాము కాటుతో ప్రాణ హాని నివారణ కోసం ఆరోగ్య కేంద్రాల్లో అవసరమైన మందులు, చికిత్స సరంజామా అనుక్షణం అందుబాటులో ఉంచాలని సూచించారు. గొట్టపు బావుల పరిశుభ్రత మొదలుకొని నీటి సంబంధిత రోగాల సంక్రమణ, వ్యాప్తి నివారణకు అవసరమైన చర్యలు చేపడతారని పేర్కొన్నారు.

వాతావరణ సమాచారం

పిడుగుపాటు మరణం వంటి ఆకస్మిక ప్రకృతి విపత్తుల నుంచి ఉపశమనం పొందేందుకు నికరమైన వాతావరణ సమాచారం కీలక పాత్ర పోషిస్తుంది. ఈ వ్యవస్థపై సాధారణ ప్రజానీకాన్ని చైతన్యపరచాలి. ముందస్తు వాతావరణ సమాచారం కోసం డాప్లర్ రాడారు వ్యవస్థ నిరవధికంగా పని చేయాలి. సకాలంలో నికరమైన వాతావరణ పరిస్థితులు గుర్తించేందుకు సంబలపూర్, బాలసోర్, భువనేశ్వర్‌లలో కొత్తగా డాప్లర్ రాడారు ఏర్పాటు చేసినట్లు అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. రాష్ట్రంలో 25 అధిక ప్రమాదకర జిల్లాలను గుర్తించారు. ఆయా ప్రాంతాల్లో తుఫాను, వరదలు వంటి విపత్కర పరిస్థితుల్లో బహుళ ప్రయోజనాలు సమకూర్చేందుకు 909 ఆశ్రయ కేంద్రాలు అందుబాటులో ఉన్నట్లు తెలిపారు. సమావేశంలో రాష్ట్ర రెవెన్యూ, విపత్తు నిర్వహణ విభాగం మంత్రి సురేష్ కుమార్ పూజారి, ఉప ముఖ్యమంత్రి కనక వర్ధన్ సింగ్ దేవ్, ఆరోగ్యం, విద్య, ప్రజా పనులు, గ్రామీణాభివృద్ధి, గృహ నిర్మాణం మరియు అటవీ, పర్యావరణ శాఖల మంత్రులు, విపత్తు ప్రభావిత జిల్లాల నుండి ఎమ్మెల్యేలు, ఎంపీలు మరియు కీలక శాఖల నుండి సీనియర్ అధికారులు పాల్గొన్నారు.

రాజధాని ప్రజలకు తీపి కబురు



సమావేశంలో పాల్గొన్న కార్పొరేటర్లు, అధికారులు

● వాట్సాప్‌లో పన్నుల చెల్లింపులు



మాట్లాడుతున్న మేయరు సులోచన దాస్

భువనేశ్వర్: రాజధాని నగర ప్రజలకు భువనేశ్వర్ నగర పాలక సంస్థ తీపి కబురు అందించింది. మున్సిపల్ పన్నుల చెల్లింపు సులభతరం అయింది. నగర వాసులు ఇక నుంచి వాట్సాప్ ద్వారా వివిధ మున్సిపల్ పన్నులను చెల్లించడానికి వీలు కల్పించారు. దీంతో భువనేశ్వర్ నగర పాలక సంస్థ(బీఎంసీ) కార్యాలయాలు లేదా వార్డు కార్యాలయాలను సందర్శించాల్సిన అవసరం లేదు. నగరపాలక సంస్థ 32వ సర్వసభ్య సమావేశంలో ఈ మేరకు నిర్ణయించినట్లు మేయర్ సులోచన దాస్ తెలిపారు. ఈ డిజిటల్ చొరవతో పన్ను చెల్లింపులను సరళీకరించి చిటికెలో చెల్లించేందుకు సౌలభ్యం కల్పించినట్లు అవుతుంది. ఈ ప్లాట్‌ఫామ్ ఒడియా మరియు ఇంగ్లిష్ ఉభయ భాషల్లో అందుబాటులో ఉంటుంది, విస్తృత జనాభా వినియోగానికి దోహదపడుతుంది. ప్రధానంగా సమయాభావంతో పన్నులు సకాలంలో చెల్లించలేని వర్గాలకు ఈ సౌకర్యం మేలు చేకూర్చుతుంది. దైనందిన మున్సిపల్ సంబంధిత కార్యకలాపాల్లో మరిన్ని సౌకర్యవంతమైన సదుపాయాలు ప్రవేశపెట్టనున్నట్లు మేయర్ తన ప్రసంగంలో పేర్కొన్నారు.

ఘనంగా గోపాలకృష్ణ పట్నాయిక్ జయంతి



గోపాల కృష్ణపట్నాయిక్ గురించి మాట్లాడుతున్న పూర్ణచంద్ర మహాపాత్రో

పర్లాకిమిడి: ఒడియా ప్రాచీన కవి కలహంస బిరుదాంకితులు గోపాలకృష్ణ పట్నాయిక్ జయంతి ఉత్సవాన్ని స్థానిక ఒడియామంగళీ వీధిలో ఉత్కళహితేషిణీ సమాజ్ హాల్‌లో ఘనంగా జరుపుకున్నారు. ఈ ఉత్సవానికి ముఖ్యఅతిథిగా ఎస్‌కేసీజీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ జితేంద్ర పట్నాయిక్, బినోదినీ కళాశాల ప్రిన్సిపల్ మనోజ్ పటాన్యిక్, పూర్ణచంద్ర మహాపాత్రో, జిల్లా సాంస్కృతిక అధికారి అర్చనా మంగరాజ్ పాల్గొన్నారు. అచార్య బినోద్ చంద్ర జెన్నా సభకు అధ్యక్షత వహించారు. కవి గోపాలకృష్ణ పట్నాయిక్‌పై నిర్వహించిన వక్తృత్వ పోటీల్లో విజేతలకు ముఖ్యఅతిథి డాక్టర్ జితేంద్ర పట్నాయిక్ చేతుల మీదుగా బహుమతి ప్రదానం చేశారు.

మత్తుపదార్థాలతో జీవితాలు చిత్తు



పర్లాకిమిడి: ర్యాలీ నిర్వహిస్తున్న అబ్కారీ, పోలీసు శాఖ అధికారులు, సిబ్బంది



పర్లాకిమిడి: మాట్లాడుతున్న కలెక్టర్, అధికారులు

పర్లాకిమిడి: మత్తుపదార్థాల జోలికి వెళ్లి జీవితాలను నాశనం చేసుకోవద్దని జిల్లా ఎస్పీ జ్యోతింద్ర నాథ్ పండా సూచించారు. అంతర్జాతీయ మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా గురువారం అవగాహన ర్యాలీని చేపట్టారు. జిల్లా అబ్కారీ శాఖ సూపరింటెండెంటు ప్రదీప్ కుమార్ సాహు ర్యాలీని ప్రారంభించారు. ఈ ర్యాలీలో వివిధ విద్యార్థులు పాల్గొన్నారు. కలెక్టరేట్ వద్ద గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ హాల్‌లో సాధారణ సమావేశం జరిగింది. కలెక్టర్ బిజయ కుమార్ సాహు మాట్లాడారు. మత్తుపదార్థాలకు అలవాటుపడి భవిష్యతను నాశనం చేసుకుంటున్నారని అన్నారు. సబ్ కలెక్టర్ అనుప్ పండా, జిల్లా సామాజిక భద్రత, దివ్యాంగుల స్వసస్తీకరణ శాఖ అధికారి సంతోష్ కుమార్ నాయక్ తదితరులు పాల్గొన్నారు. డ్రగ్స్, గంజాయి నిర్మూలనపై నిర్వహించిన వక్తృత్వ, డ్రాయింగ్ పోటీల విజేతలకు కలెక్టర్ బహుమతులు అందజేశారు.

కొరాపుట్‌లో..

కొరాపుట్: నబరంగ్‌పూర్ జిల్లా కేంద్రంలో అంతర్జాతీయ మాదక ద్రవ్యాల నిర్మూలన దినోత్సవం సందర్భంగా అవగాహన ర్యాలీ చేపట్టారు. ఈ ర్యాలీని కలెక్టర్ డాక్టర్ శుభంకర్ మహాపాత్రో, ఎమ్మెల్యే గౌరీ శంకర్ మఝి, ఎస్పీ సందీప్ సంపత్ జెండా ఊపి ప్రారంభించారు. ఉన్నతాధికారులు, విద్యార్థులు పాల్గొన్నారు. కొరాపుట్ జిల్లా కేంద్రంలో కలెక్టర్ వీ.కీర్తి వాసన్ ర్యాలీ ప్రారంభించారు. కొరాపట్ జిల్లా పరిషత్ ప్రెసిడెంట్ సస్మితా మెలక ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.

రాయగడలో..

రాయగడ: మత్తుపదార్థాల అక్రమ రవాణా, సాగు వంటి వాటికి దూరంగా ఉండాలని పోలీసులు గ్రామాల్లో అవగాహన కార్యక్రమాల చేట్టారు. చంద్రపూర్ సమితి పరిధిలోని బీజాపూర్, పద్మపూర్ సమితిలోని లికిటిపదర్, గుడారి సమితిలోని బండిలి తదితర గ్రామాల్లో అవగాహన ర్యాలీలు చేపట్టారు. గంజాయి సాగుకు స్వస్తి చెప్పి, జీవనాధారమైన వాణిజ్య, కూరగాయల పంటలపై దృష్టి సారించాలన్నారు.

మల్కన్‌గిరిలో..

మల్కన్‌గిరి: మల్కన్‌గిరి జిల్లా సామాజిక భద్రత, ప్రత్యేక అవసరాల కలిగిన వారికి సాధికారత,జిల్లా ఎక్సైజ్ శాఖ సంయుక్త ఆహ్వానంతో అంతర్జాతీయ మాదకద్రవ్యాల దుర్వినియోగం, అక్రమ రవాణా నిరోధక దినోత్సవాన్ని నిర్వహించారు. గురువారం ఉదయం స్థానిక స్టేడియం నుంచి డీఎన్‌కే గ్రాండ్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఎక్సైజ్ కార్యాలయంలో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లా న్యాయమూర్తి సంగీతా పాత్రో, జిల్లా అదనపు కలెక్టర్ వేద్బర్ ప్రధాన్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. మాదకద్రవ్య నివారణ కేంద్రం ద్వారా మాదక ద్రవ్యాలను పూర్తిగా వదిలిన నాలుగురు వ్యక్తులను సన్మానించారు. జిల్లా సివిల్ కోర్టు రిజిస్ట్రార్ కై లాశ్ సాహు, అశోక్ పట్నాయక్, సాగర్ పాణిగ్రాహి, జిల్లా సామాజిక భద్రతాధికారి నిర్మల్ దురువా, ఎక్సైజ్ అధికారి బిబేంద్ర పండా, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.



కొరాపుట్: నబరంగ్‌పూర్‌లో ర్యాలీ ప్రారంభిస్తున్న కలెక్టర్ శుభంకర్



కొరాపుట్: ర్యాలీ ప్రారంభిస్తున్న కలెక్టర్ కీర్తి వాసన్



మల్కన్‌గిరి: ర్యాలీలో పాల్గొన్న ఎక్సైజ్ సిబ్బంది



మల్కన్‌గిరి: మాదకద్రవ్యాలు వదలాలని ప్రజలతో ప్రతిజ్ఞ చేయిస్తున్న అతిథులు



మల్కన్‌గిరి: మాదకద్రవ్యాలను వడిచిపెట్టిన వృద్ధుడిని సన్మానిస్తున్న అధికారులు

జాతీయ రహదారి మూసివేత



నబరంగ్‌పూర్ జిల్లా జరాబల్ వద్ద మూసివేసిన రోడ్డు

కొరాపుట్: నబరంగ్‌పూర్ జిల్లాలోని పపడాహండి – ఉమ్మర్‌కోట్ జాతీయ రహదారి తాత్కాలికంగా మూసివేశారు. గురువారం కురిసిన భారీ వర్షాలకు జరాబల్ వద్ద నిర్మితమవుతున్న వంతెన వద్ద ప్రమాదకర స్థితిలో వరద నీరు పోటెత్తింది. అక్కడ ఉన్న సర్వీస్ రోడ్డు మీద 10 అడుగుల ఎత్తులో నీరు ప్రవహిస్తోంది. ఇక్కడ లోతు తెలియక వాహనదారులు ప్రమాదాలు బారినపడుతున్నారు. దీంతో జిల్లా రెవెన్యూ విభాగం ప్రమాదకర హెచ్చరికలు చేసింది. ఈ రోడ్డుని మూసివేస్తున్నట్లు రెండువైపులా బోర్డులు పెట్టింది. ప్రత్యామ్నాయంగా గ్రామీణ ప్రాంతాలను కలుపుతూ మూడు మార్గాలను వాహనదారులకు సూచించారు. వరద తగ్గేంత వరకు ఈ మార్గం తెరవకూడదని జిల్లా అధికార యంత్రాంగం ఆదేశాలు జారీ చేసింది.

విద్యార్థుల నిరసన



మల్కన్‌గిరి కాలేజీ వద్ద నిరసన తెలుపుతున్న దృశ్యం

మల్కన్‌గిరి: గోపాల్‌పూర్‌లో విద్యార్థినిపై సామూహిక అత్యాచారానికి నిరసనగా జిల్లా యువ బీజేడీ ఆధ్వర్యంలో విద్యార్థులు గురువారం నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా మల్కన్‌గిరి బీజేడీ యువనేత రవి రాజేష్ మాట్లాడుతూ.. బీజేపీ ప్రభుత్వంలో మహిళలు, బాలికలపై హత్యలు, అత్యాచారాలు పెరిగాయని మండిపడ్డారు. గోపాల్‌పూర్ లాంటి పర్యటక ప్రదేశంలో విద్యార్థిని స్నేహితుడిని చెట్టుకు కట్టేసి యువతిపై సామూహిక అత్యాచారానికి పాల్పడడం దారుణమన్నారు. నిందుతులకు కఠిన శిక్షలు పడేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మల్కన్‌గిరి మాజీ ఎమ్మెల్యే మానాస్ మడ్కామి, బీజేడీ కార్యకర్తలు అడ్మారాబా, మహిళా అధ్యక్షురాలు లక్ష్మీప్రియా నాయక్ తదితరులు పాల్గొన్నారు.



సీఎం ఫొటోతో విద్యార్థిని నిరసన

తాబేళ్ల అక్రమ విక్రయం



మంగుపల్లి గ్రామం వద్ద అటవీ శాఖ అరెస్టు చేసిన సుభాష్


మల్కన్‌గిరి:

మల్కన్‌గిరి జిల్లా కలిమెల సమితి మంగపల్లి గ్రామం వద్ద అక్రమంగా తాబేళ్లను విక్రయిస్తుండగా గురువారం అటవీ శాఖ వారు పట్టుకున్నారు. వ్యాపారి సుభాష్‌ను అరెస్టు చేశారు. సుభాష్ ఆంధ్రా నుంచి తాబేళ్లను తెచ్చి అమ్ముతున్నాడని అందిన సమాచారం మేరకు.. కలిమెల రెవెన్యూ శాఖ అటవీ శాఖ అధికారులకు సమాచారం ఇచ్చారు. దీంతో వారు మంగపల్లి గ్రామానికి వెళ్లి సాయంత్రం 4 గంటల సమయంలో సుభాష్‌ను అరెస్టు చేశారు. 24 తాబేళ్లను స్వాధీనం చేసుకున్నారు.



రెండు డొక్కుల్లో 24 తాబేళ్లు

సైకత శుభాకాంక్షలు



పవిత్ర రథయాత్ర శుభాకాంక్షలు తెలియజేస్తూ అంతర్జాతీయ శాండ్ యానిమేటర్ మానస్ కుమార్ సాహు ఈ సైకత శిల్పం తీర్చిదిద్దారు. పూరీ బలియపండా బీచ్‌లోని మానస్ సాహు ఆవిష్కరించిన ఈ శిల్పం సందర్శకుల్ని విశేషంగా ఆకట్టుకుంటుంది.

- భువనేశ్వర్

నేత్రోత్సవం..



పర్లాకిమిడి: జగన్నాథ మందిరం వద్ద అందమైన రంగవల్లులు



పర్లాకిమిడి: నయయవ్వన రూపంలో జగన్నాథుడు



కొరాపుట్: నవ యవ్వనంతో నబరంగ్‌పూర్‌లో జగన్నాథ, శుభద్ర, బలభద్రుడు

పర్లాకిమిడి: స్థానిక రాజవీధిలో గల మందిరంలో జగన్నాథ, బలభద్ర, సుభద్రల నవయవ్వన రూపంతో గురువారం సాయంత్రం భక్తులకు దర్శనం కల్పించారు. 15 రోజులుగా చీకటి గదిలో సపర్యలు పొందిన జగన్నాథుడు నేత్రోత్సవాన్ని గురువారం నిర్వహించారు. శుక్రవారం రథయాత్ర సందర్భంగా జగన్నాథ, బలభద్ర, సుభద్రలు గుండిచా మందిరానికి మూడు రథాలలో బయలుదేరుతారు. ఉదయం 11.30 నిమిషాలకు జగన్నాథుని పహండి జరుగుతుందని సేవాయత్‌లు తెలియజేశారు. జిల్లా ఎస్పీ జ్యోతింద్రనాథ్ పండా ఆధ్వర్యంలో మాక్ డ్రిల్ నిర్వహించారు.

ప్రముఖుల దర్శనం..


కొరాపుట్: జగన్నాథ స్వామి గురువారం రాత్రి నేత్రోత్సవం తర్వాత నవయవ్వనంతో బయటకు వచ్చాడు. శుభద్ర, బలభద్రతో ఉన్న జగన్నాథుని దర్శనానికి భక్తులు పోటేత్తారు. నబరంగ్‌పూర్ జిల్లా కేంద్రంలోని జగన్నాథ మందిరంలో రాజ పురోహితుడు నరింగ త్రిపాఠి నేతృత్వంలో నేత్రోత్సవం జరిగింది. కొరాపుట్ జిల్లా కేంద్రంలో కలెక్టర్ వి.కీర్తి వాసన్, ఎస్పీ రోహిత్ వర్మ తొలి దర్శనం చేసుకున్నారు. నబరంగ్‌పూర్ జిల్లా చాందాహండి సమితి దండాబడి గ్రామంలో మాజీ మంత్రి రమేష్ చంద్ర మఝి, మాజీ ఎమ్మెల్యే ప్రకాష్ చంద్ర మఝి తొలి దర్శనం చేశారు. ఆంధ్రా-ఒడిశా వివాదస్పద ప్రాంతం కొరాపుట్ జిల్లా పొట్టంగి సమితి కొఠియాలో రథయాత్ర ఏర్పాట్లని గొదాదర్ పరిడా, మాజీ ఎంపీ జయరాం పంగి పర్యవేక్షించారు. అనంతరం దేవ దేవుళ్లని దర్శనం చేసుకున్నారు. కొఠియాలో రథయాత్ర ఒకరోజు ఆలశ్యంగా శనివారం జరగనుంది.

మల్కన్‌గిరిలో..

మల్కన్‌గిరి: మల్కన్‌గిరి జిల్లా కేంద్రంలో దుర్గగుడి వీధిలో గల జగన్నాథ్ స్వామి ఆలయంలో గురువారం స్వామివారి నేత్రోత్సవం జరిగింది. 10 రోజుల జ్వరంతో బాధపడి తిరిగి రథయాత్రకు ముస్తాబయ్యారు. పోలీసుశాఖ, జిల్లా యంత్రాంగం రథయాత్రకు పూర్తి ఏర్పాట్లు చేశారు. మల్కన్‌గిరిలో రెండు రథాలు లాగుతారు. ప్రజాలకు ఏలాంటి ఇబ్బందులు పడకుండా ఏర్పాట్లు చేశారు.



కొరాపుట్: నబరంగ్‌పూర్‌లో నేత్రోత్సవ పూజలు చేస్తున్న రాజ పురోహితుడు నర్సింగ త్రిపాఠి



కొరాపుట్: శభరి క్షేత్రంలో నవ యవ్వనంలో దేవదేవుళ్లు



మల్కన్‌గిరి: ప్రత్యక పూజలు చేస్తున్న సేవాయతులు



మల్కన్‌గిరి: యాత్రకు ముస్తాబైన జగన్నాథ స్వామి

క్లుప్తంగా

నేడు జగన్నాథుని రథయాత్ర



జగన్నాథునికి బింబ దర్శనం ఏర్పాటుచేసిన అర్చకులు

విజయనగరం టౌన్: జగన్నాథస్వామి రథయాత్ర మహోత్సవం శుక్రవారం అంగరంగ వైభవంగా ప్రారంభం కానుంది. ఈ నేపథ్యంలో స్వామివారికి గురువారం వేకువజాము నుంచి ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్థానిక సంతపేట, దాసన్నపేట, మన్నార్ రాజగోపాలస్వామి ఆలయం ఆవరణలో స్వామివారికి ప్రత్యేక పూజలు చేపట్టారు. విశ్వక్సేనపూజ, పుణ్యాహవచనం, కళావాహన, బింబ దర్శనం, నేత్రోత్సవం, ప్రసాద వినియోగం గావించారు. సాయంత్రం స్వామివారి శాంతి కల్యాణోత్సవం, రాత్రి రథోత్సవానికి స్వామివారిని సిద్ధం చేశారు. రక్షాబంధనాలు ధరించారు. శుక్రవారం ఉదయం 5 గంటల నుంచి ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. అనంతరం ఉదయం 9.30 గంటలకు మేళతాళాలతో స్వామివారి రథారోహణ కార్యక్రమం చేపట్టనున్నట్లు అధికారులు, కమిటీ ప్రతినిధులు పేర్కొన్నారు. భక్తులందరూ స్వామివారిని దర్శించి, తరించాలని కోరారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

బొబ్బిలిరూరల్: మండలంలోని పారాది గ్రామం వద్ద వేగావతి నదిలో అక్రమంగా ఇసుకను తవ్వి తరలిస్తున్న ట్రాక్టర్‌ను ఆర్డీఓ జేవీవీ రామ్మోహనరావు గురువారం పట్టుకున్నారు. ట్రాక్టర్‌ను నిలువరించేందుకు ప్రయత్నించినా డ్రైవర్ ఆపకుండా వెళ్లిపోవడంతో ఆర్డీఓ ఆదేశాల మేరకు మెట్టవలసలోని యజమాని మీసాల చంద్రశేఖర్ ఇంటి వద్ద ట్రాక్టర్‌ను ఆర్ఐ రామకుమార్, సిబ్బంది గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. ఇసుక అక్రమ తరలింపు, ఆపకుండా వెళ్లిపోయినందుకుగాను రూ.20వేల జరిమానా విధించామని ఆర్ఐ రామకుమార్ తెలిపారు.

బ్యాటరీల చోరీ


- ఆందోళన చెందుతున్న వాహన యజమానులు

పార్వతీపురం రూరల్: పట్టణంలోని కొత్తవలస ఫ్లైఓవర్ కింద పార్కింగ్ చేసి ఉంచిన మూడు లగేజీ వ్యాన్లు, ఒక లారీకి ఉన్న బ్యాటరీలను గుర్తుతెలియని దుండగులు అపహరించారని వాహన యజమానులు ఆందోళన చెందారు. గతంలో కూడా ఎన్నోమార్లు ఈ విధంగా వాహనాలకు ఉన్న బ్యాటరీలను వైర్లను చిందరవందరంగా కోసి దొంగిలించారని వాపోయారు. ఈ మేరకు గతంలో పోలీసులకు ఫిర్యాదు చేశామన్నారు. గురువారం ఉదయం వాహనాల వద్దకు వెళ్లేసరికి వైర్లు కట్‌చేసి ఉండడంతో బ్యాటరీలు లేకపోవడాన్ని గమనించినట్లు తెలిపారు. దీంతో పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

దాడికి గురైన వ్యక్తి మృతి

బొబ్బిలి: పట్టణ పరిధిలోని గ్రోత్‌సెంటర్‌లో రాఘవ కన్‌స్ట్రక్షన్స్ స్టోర్‌లో వాచ్‌మన్‌గా పనిచేస్తున్న కనిమెరకల వెంకటరమణ(55) పై ఈనెల 20న గుర్తు తెలియని వ్యక్తి దాడి చేశాడు. వెంకట రమణ కుమారుడు పురుషోత్తమరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు సీఐ కె.సతీష్ కుమార్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ఎప్పటిలాగానే వెంకట రమణ విధులకు హాజరయ్యాడు. సరిగ్గా రాత్రి 12.30 గంటల సమయంలో గుర్తు తెలియని వ్యక్తి కంపెనీలోకి ప్రవేశించి బలమైన ఆయుధంతో వెంకటరమణ ముఖం, తలపై బలంగా దాడి చేశాడు. దీంతో వెంటనే స్థానికులు బొబ్బిలి ప్రభుత్వ ఆస్పత్రిలో చేర్పించారు. ప్రాథమిక చికిత్స అనంతరం విజయనగరం కేంద్రాస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ బుధవారం వేకువజామున మృతి చెందాడు. దాడి చేసిన వ్యక్తిని పట్టుకునేందుకు మూడు టీమ్‌లను నియమించామని, త్వరలోనే నిందితుడిని పట్టుకుంటామని సీఐ తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

విద్యుత్ షాక్‌తో యువకుడి మృతి



విద్యుత్ షాక్‌తో మృతి చెందిన ప్రదీప్

శృంగవరపుకోట: ఇంటిముందు మావిడాకుల తోరణాలు వాడనే లేదు. పెళ్లింట సందడి ముగియనే లేదు. విధి ఆడిన ఆటలో నవవరుడు ప్రాణాలు చాలించాడు. తాళికట్టిన భర్త తరలిరాని లోకాలకు వెళ్లాడని తెలిసి నవవధువు శోకంతో కుప్పకూలిపోయింది. ఈ ఘటన వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన లగుడు ప్రదీప్(26)కు ఇటీవల పెళ్లయింది. ప్రదీప్ తల్లితో కలిసి గురువారం గడ్డి కోసేందుకు వెళ్లాడు. గడ్డిమోపు పట్టుకుని తిరిగి వస్తున్న సమయంలో తెగి ఉన్న విద్యుత్ తీగ తగిలి షాక్‌కు గురయ్యాడు. దీంతో తల్లి అరుపులతో పక్క పొలాల్లో ఉన్న గ్రామస్తులు పరుగున వచ్చి చూసేసరికే ప్రదీప్ అనంతలోకాలకు వెళ్లిపోయాడు. భర్త పార్థివదేహాన్ని చూసి భార్య ఏడుస్తుంటే గ్రామస్తుల కళ్లు చెమర్చాయి. కాగా ఈ ఘటనపై ఇటు విద్యుత్‌శాఖ అధికారులు కానీ, అటు పోలీస్ ఉద్యోగులు కానీ నోరు మెదపలేదు. ఎటువంటి సమాచారం ఇవ్వలేదు.

రామయ్యా..చూడవేమయ్యా..!

- పవిత్ర బోడికొండను తవ్వేస్తున్న అక్రమార్కులు
- మనోభావాలను దెబ్బతీస్తున్నారని భక్తుల ఆగ్రహం
- స్పందించని అధికార యంత్రాంగం



సీతారామునిపేట సమీపంలో ఉన్న బోడికొండ వద్ద గ్రావెల్ తవ్వకాలు



కొండపై నుంచి జారిపడిన బండరాయి

నెల్లిమర్ల రూరల్: సాక్షాత్తు శ్రీరాముడే నడయాడిన నేలగా రామతీర్థాన్ని భక్తులు విశ్వసిస్తుంటారు. నీలాచలం పర్వతంగా పిలుస్తున్న రామతీర్థంలోని బోడికొండపై పాండవులు సంచరించినట్లు చరిత్ర చెబుతోంది. కొండపై శ్రీ కోదండరాముడి ఆలయంతో పాటు అలనాటి చారిత్రక గుర్తులను చూసేందుకు సందర్శకులు నిత్యం కొండపైకి వెళ్తుంటారు. అంతటి సుదీర్ఘ చరిత్ర కలిగిన బోడికొండను సైతం అక్రమార్కులు విడిచిపెట్టడం లేదు. గడిచిన కొద్ది నెలలుగా ధనార్జనే లక్ష్యంగా శ్రీరాముడి కొండనే తవ్వేస్తూ భక్తుల మనోభావాలను దెబ్బతీస్తున్నారు. సీతారామునిపేట జంక్షన్ సమీపంలో ఉన్న కొండ వద్ద గడిచిన కొన్ని రోజులుగా గ్రావెల్ అక్రమ తవ్వకాలు జోరుగా సాగుతున్నాయి. సమీప గ్రామాల్లో ఇళ్ల నిర్మాణాలు జరుగుతుండడంతో కొందరు అక్రమార్కులు జేసీబీలు, ట్రాక్టర్లను పెట్టి కొండను తవ్వేస్తున్నారు. పట్టపగలే ఈ వ్యవహారం జరుగుతున్నా..ఇటు దేవస్థానం అధికారులు కానీ, అటు రెవెన్యూ యంత్రాంగం కానీ స్పందించకపోవడం బాధాకరం. కొండపై ఉన్న పెద్దపెద్ద బండరాళ్లు సైతం కిందపడుతున్నాయంటే తవ్వకాలు ఏ విధంగా జరుగుతున్నాయో అర్థం చేసుకోవచ్చు. ట్రాక్టర్ లోడును పరిధిని బట్టి రూ.600 నుంచి రూ.1000 వరకు అమ్మేస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. నెల్లిమర్ల-రణస్థలం ప్రధాన రహదారి పక్కనే ఈ అక్రమ తవ్వకాలు జరుగుతుండడం గమనార్హం. ప్రభుత్వ భూములకు ఎలాగూ రక్షణ లేదు సరికదా.. సాక్షాత్తు దేవుడి కొండనైనా అక్రమార్కుల నుంచి కాపాడలేరా..? అంటూ భక్తులు విమర్శలు గుప్పిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి బోడికొండను తవ్వేస్తున్న అక్రమార్కులను గుర్తించి వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

వృద్ధిరేటు పెరిగేలా ప్రణాళికలు



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్

- కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్

పార్వతీపురంటౌన్: వ్యవసాయం, అనుబంధ రంగాలతో పాటు అన్ని ప్రభుత్వ శాఖల్లో వృద్ధిరేటు గణనీయంగా పెరిగేలా ప్రణాళికలు రూపొందించాలని కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ పేర్కొన్నారు. సుపరిపాలన కార్యక్రమం నేపథ్యంలో ప్రభుత్వ శాఖాధికారులతో సమీక్ష సమావేశాన్ని కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్ గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో వ్యవసాయ, అనుబంధ రంగాల్లో నిర్దేశించిన లక్ష్య సాధన దిశగా ప్రతి ఏటా 15 శాతం కంటే ఎక్కువ వృద్ధి రేటు సాధించేలా ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని చెప్పారు. శాస్త్ర, సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకుని ముందుకు వెళ్లేలా ప్రణాళికలు ఉండాలని సూచించారు. ముఖ్యంగా వ్యవసాయం, తృణధాన్యాలు, డ్రోన్ల వినియోగం, ఆధునిక వ్యవసాయ యాంత్రీకరణతో అధిక ఆదాయం పొందాలని అభిప్రాయపడ్డారు. అదేవిధంగా పాల దిగుబడి గతేదాది కంటే ఈ ఏడాది మరింత పెరిగేలా చర్యలు చేపట్టాలని, పశు సంపదను ప్రోత్సహించడంతో అధిక ఆదాయం లభిస్తుందని పేర్కొన్నారు. అలాగే మిగిలిన అన్ని ప్రభుత్వ శాఖల వారికి నిర్దేశించిన లక్ష్యాల ప్రగతిలో వృద్ధి రేటు గణనీయంగా పెరగాలని కలెక్టర్ కోరారు. సమావేశంలో జిల్లా ప్రణాళిక, వ్యవసాయ, ఉద్యానవన, మత్స్య, అటవీ, పశుసంవర్ధక, వైద్యారోగ్య, ఇంటర్మీడియట్ విద్యాశాఖల అధికారులు పి.వీర్రాజు, కె.రాబర్ట్ పాల్, వై.క్రాంతి కుమార్, వై.శ్రీదేవి, జేపీప్రసూన, డా.ఎస్.మన్మథ రావు, డా.ఎస్.భాస్కర రావు, జిల్లా టీబీ నియంత్రణ అధికారి డా.ఎం.వినోద్ కుమార్, డీఆర్‌డీఏ పీడీలు ఎం.సుధారాణి, డా.టి.కనకదుర్గ, వై.నాగేశ్వరరావు, పరిశ్రమల కేంద్రం ఎ.డి పి.సీతారాము, జిల్లా గ్రామీణ నీటి సరఫరా విభాగం, ఆర్అండ్‌బీ ఇరిగేషన్ ఈఈలు ఒ.ప్రభాకరరావు, ఎస్.రామచంద్రరావు, డీఎస్.ప్రదీప్, ఎ.డిల్లీశ్వర రావు, పంచాయతీ రాజ్ డీఈఈ కె.సంజీవరావు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

దేవదాయ భూముల పరిరక్షణకు చర్యలు

- జాయింట్ కలెక్టర్ సేతు మాధవన్



సమావేశంలో మాట్లాడుతున్న జేసీ సేతు మాధవన్

విజయనగరం అర్బన్: దేవస్థానం భూముల్ని అన్ని విధాలా పరిరక్షించడానికి చర్యలు తీసుకోవాలని జాయింట్ కలెక్టర్ సేతు మాధవన్ అన్నారు. ఈ మేరకు శుక్రవారం ఆయన జిల్లా స్థాయి దేవాదాయ భూముల పరిరక్షణ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ 11 వేల ఎకరాల భూమి దేవదాయ శాఖ పరిధిలో ఉందని అందులో కొంత ఆక్రమిత భూమి ఉందని, ఈ భూమికి వెంటనే సర్వే చేయించాలని రెవెన్యూ అధికారులను ఆదేశించారు. అలాగే మాన్సాస్ ట్రస్టుకు చెందిన భూమిలో కూడా ఆక్రమణలు ఉన్నాయని, ఇందులో వ్యవసాయ, నివాస, వాణిజ్య పరంగా ఆక్రమించిన వివిధ సంస్థల ఆక్రమిత భూములకు సంబంధించి రూ.50 లక్షల వరకు యూజర్ చార్జీల కింద ఆక్రమణదారులు చెల్లించారని తెలిపారు. అయితే ఎటువంటి యూజర్ చార్జీలు చెల్లించకుండా కమర్షియల్‌గా వినియోగిస్తున్న దేవదాయ భూముల్లోని సముదాయాలను తొలగించాలని, అందుకు రెవెన్యూ అధికారులు పోలీస్ వారి సహకారాన్ని తీసుకోవాలని సూచించారు. భూముల విషయంలో కోర్టు ఆర్డర్స్‌ను వెంటనే అమలు చేయాలని స్పష్టం చేశారు. మ్యుటేషన్స్ చేయవలసిన వాటి వివరాలను మండలాల వారీగా ఆర్‌డీఓలకు అందజేయాలని, ఆర్‌డీఓలు వెంటనే మ్యుటేషన్ జరిగేలా చూడాలని ఆదేశించారు. సమావేశంలో డీఆర్ఓ శ్రీనివాసమూర్తి, దేవదాయశాఖ ఎ.సి శిరీష, ఆర్‌డీఓలు సవరమ్మ, రామ్‌మోహన్ రావు, ఆశయ్య, సర్వే ఎ.డి రమణమూర్తి, జిల్లా పంచాయతీ అధికారి మల్లికార్జున రావు, డీఎస్పీ వీరకుమార్, డిప్యూటీ కమిషనర్, ఏఓలు పాల్గొన్నారు.

ఎరువులు అమ్మలేం

- చేతులెత్తేస్తున్న డీలర్లు
- ఆందోళనలో రైతులు
- ఫెర్టిలైజర్స్ కొనుగోలు చేయాలంటే, నానో యూరియా కాంప్లెక్స్ ఎరువుల కొనుగోలు తప్పనిసరి
- భారాన్ని రైతులపై రుద్దుతున్న ఎరువుల డీలర్లు
- ఆర్ఎస్‌కేలో ఎరువులు నిల్వచేసేందుకు గొడౌన్‌లు కరువు

మక్కువ: ఫెర్టిలైజర్స్ కంపెనీల ఒత్తిళ్లకు ఎరువుల డీలర్లు తలొగ్గి, ధరల భారాన్ని మోస్తూ, ఆ భారాన్ని రైతులపై మోపుతున్నారు. వాస్తవానికి ఫెర్టిలైజర్స్ కంపెనీల నుంచి నేరుగా వాహనాలపై దుకాణాలకు ఎరువులు పంపించాల్సి ఉంది. ప్రస్తుతం రైళ్లలో సమీప పట్టణాలకు ఎరువులు చేరుకుంటున్నాయి. అక్కడి నుంచి మండలకేంద్రాలకు తరలించాలంటే బస్తాకు రూ.50, గ్రామీణ ప్రాంతాల్లోని ఎరువుల దుకాణానికి చేర్చాలంటే బస్తాకు రూ.70వరకు ఎరువుల డీలర్లపై భారం పడుతోంది. ఆ భారాన్ని డీలర్లు మోయలేక, ఆరుగాలం శ్రమించి పండిస్తున్న అన్నదాతపై భారం మోపడంతో రైతన్నలు విలవిల్లాడుతున్నారు.

నానో, కాంప్లెక్స్ ఎరువుల కొనుగోలు చేయాలి

ఎరువుల డీలర్లు ఫెర్టిలైజర్స్ కంపెనీల నుంచి యూరియా, డీఏపీ కొనుగోలు చేయాలంటే తప్పనిసరిగా వారి దగ్గర నానో యూరియా, కాంప్లెక్స్ ఎరువులు కొనుగోలు చేయాల్సిందేనని ఒత్తిడి చేస్తున్నట్లు గురువారం ఏడీఏ ఎం.మధుసూదనరావు సాలూరులో నిర్వహించిన సమావేశంలో మక్కువ మండలానికి చెందిన డీలర్లంతా గగ్గోలు పెట్టారు. నానో యూరియా, కాంప్లెక్స్ ఎరువులను రైతులకు విక్రయించలేక అనేక ఇబ్బందులు పడుతున్నట్లు డీలర్లు వాపోయారు. ఇలా అయితే ఎరువులు విక్రయించలేమంటూ డీలర్లు చేతులెత్తేస్తున్నారు.

ఆర్ఎస్‌కేలో గొడౌన్ సౌకర్యం నిల్

రైతుసేవా కేంద్రాలలో ఎరువులు నిల్వచేసేందుకు గొడౌన్ సౌకర్యం లేకపోవడంతో, అధికారులు రైతులకు అవసరమైన ఎరువులను నిల్వ చేయలేకపోతున్నారు. దీంతో రైతులకు అవసరమైన సమయాల్లో ఎరువులు లభ్యం కాకపోవడంతో, ఎరువుల దుకాణాలను ఆశ్రయిస్తున్నారు. ఈ క్రమంలో ఎంఆర్‌పీ కంటే, ఏకంగా ఒక్కో బస్తాపై రూ.50నుంచి, రూ.70 వరకు ఎరువుల దుకాణదారులు వసూలు చేస్తున్నారని, కొనుగోలు చేసిన ఎరువులకు సంబంధించి, రసీదులు ఇవ్వకుండా, తెల్లకాగితంపై అక్షరాలు రాసి పంపిస్తున్నారని రైతులు ఆరోపిస్తున్నారు. ఖరీఫ్‌సీజన్ ప్రారంభానికి ముందే ఎరువుల విక్రయం దందా ఇంతలా సాగుతుంటే, ముమ్ముందు, అత్యవసర సమయంలో ఏ విధంగా ధరలు ఉంటాయోనని రైతులు తలలు పట్టుకుంటున్నారు.

రైతుల అవసరం మేరకు ఎరువులు

మక్కువ మండలంలో సుమారు 10,800 ఎకరాల్లో వరి, 859 ఎకరాల్లో మొక్కజొన్న, 558ఎకరాల్లో పత్తి పంటలను రైతులు ఏటా సాగుచేస్తున్నారు. ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో పంటల సాగుకోసం యూరియా 224టన్నులు, డీఏపీ 254టన్నులు మండలానికి తీసుకువచ్చినట్లు వ్యవసాయాధికారిణి చింతల భారతి తెలిపారు. రెండురోజుల్లో సొసైటీలకు యూరియా, డీఏపీ 200టన్నులు, ఆర్ఎస్‌కేలకు 80టన్నుల యూరియా, డీఏపీ తెప్పిస్తున్నామని ఆమె చెప్పారు. ఎరువులు ఎంఆర్‌పీ కంటే అధికంగా విక్రయిస్తున్నట్లు ఫిర్యాదులందితే, సంబంధిత దుకాణం లైసెన్స్ రద్దుచేస్తామని ఆమె స్పష్టం చేశారు.

గ్రామ సర్వేయర్ల సమస్యలు పరిష్కరించాలి



వినతిపత్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్

- కలెక్టర్‌కు వినతిపత్రం అందజేత

పార్వతీపురం: గ్రామసర్వేయర్లు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ గురువారం కలెక్టరేట్‌కు ర్యాలీగా వచ్చి కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సర్వేయర్ల సంఘం నాయకుడు ఉదయ్ కుమార్ మాట్లాడుతూ ఐదేళ్ల సర్వీసు పూర్తయినప్పటికీ రేషనలైజేషన్‌లో కానీ, బదిలీ ప్రక్రియనులోకానీ తమకు ప్రాధాన్యం ఇవ్వడం లేదన్నారు. గ్రామ సర్వేయర్లుగా ఉన్న తమకు సొంత మండలాల్లో పోస్టింగ్ ఇవ్వాలని కోరుతూ కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో గరుగుబిల్లి, పార్వతీపురం, కొమరాడ, కురుపాం, జియ్యమ్మవలస, పాలకొండ, వీరఘట్టం, సీతంపేట తదితర మండలాల నుంచి సర్వేయర్లు పాల్గొన్నారు.

డ్రగ్స్ రహిత జిల్లాకు భాగస్వాములు కావాలి

- కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్



జెండా ఊపి ర్యాలీని ప్రారంభిస్తున్న కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్, అధికారులు, ప్రజాప్రతినిధులు

పార్వతీపురంటౌన్: డ్రగ్స్ రహిత జిల్లాగా తీర్చిదిద్దడానికి ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ జిల్లా ప్రజలకు పిలుపునిచ్చారు. నషా ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా మత్తు పదార్థాల నియంత్రణపై జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో గురువారం పట్టణంలో ర్యాలీ జరిగింది. ఈ కార్యక్రమాన్ని స్థానిక ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర, ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి అసుతోష్ శ్రీవాస్తవతో కలిసి కలెక్టర్ జెండా ఊపి లాంఛనంగా ప్రారంభించి ర్యాలీలో పాల్గొన్నారు. ఆర్‌సీఎం నుంచి బయల్దేరిన ర్యాలీ కలెక్టరేట్ వరకు సాగింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పాఠశాల స్థాయి నుంచే మత్తు పదార్థాల పట్ల అవగాహన ఉండాలని, దీని నియంత్రణకు విద్యార్థులను చైతన్యవంతులను చేయాలని. అప్పుడే సమాజం నుంచి డ్రగ్స్‌ను పూర్తిగా రూపుమాపవచ్చని కలెక్టర్ అభిప్రాయపడ్డారు. జిల్లాలో డ్రగ్స్ ను రూపుమాపవలసిన గురుతర బాధ్యత విద్యార్థులపై ఉందని, దానికోసం ఈగల్ క్లబ్బులను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. నషా ముక్త్ భారత్ అభియాన్‌లో భాగంగా పార్వతీపురంలో గంజాయి సాగును పూర్తిగా నిర్మూలించామన్నారు. డ్రోన్ టెక్నాలజీ, సీసీ కెమెరాలు, చెక్ పోస్టులను ఏర్పాటు చేసి మత్తు పదార్థాల నియంత్రణకు పటిష్ఠ నిఘా పెట్టినట్లు చెప్పారు.

1,873 కేజీల గంజాయి స్వాధీనం

గతేడాది 22 గంజాయి కేసులను నమోదుచేసి 1,873 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకుని 22 వాహనాలను సీజ్ చేశామని కలెక్టర్ చెప్పారు. గంజాయి సరఫరా చేసే వారిపై కూడా కచ్చితంగా కేసులను నమోదు చేస్తున్నట్లు తెలిపారు. జిల్లాలో సారా కూడా ఉంటుందని, దీనికోసం నవోదయం 2.0 కార్యక్రమాన్ని తీసుకువచ్చినట్లు తెలిపారు. గంజాయి, సారా రహిత గ్రామాలుగా పార్వతీపురం మన్యం మన్యం జిల్లాను తీర్చిదిద్దాలని, ఇందులో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే విజయచంద్ర, ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి అశుతోష్ శ్రీవాస్తవ, పాలకొండ డీఎస్పీ రాంబాబు, ఏఆర్ డీఎస్పీ థామస్ రెడ్డి, జిల్లా వైద్యారోగ్యరోగ్య శాఖాధికారి డా.ఎస్. భాస్కరరావు, యువత పాల్గొన్నారు.

మలేరియాతో గిరిజన విద్యార్థిని మృతి



మలేరియాతో మృతి చెందిన తనూజ

జియ్యమ్మవలస రూరల్: మండలంలోని తామరకండి జమ్ము బాలికల వసతి గృహంలో ఆరో తరగతి చదువుతున్న కడ్రక తనూజ మలేరియా జ్వరంతో గురువారం మృతి చెందింది. గొర్లి గ్రామానికి చెందిన తనూజ ఇంకా ఆశ్రమ పాఠశాలకు వెళ్లలేదు. కొద్దిరోజులుగా మలేరియా జ్వరంతో బాధపడుతుండడంతో పార్వతీపురంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స అందించినా ఫలితం లేకపోయిందని కుటుంబ సభ్యులు తెలిపారు. బాలిక జ్వరంతో మృతి చెందడంతో గ్రామస్తులు భయాందోళన చెందుతున్నారు. మలేరియా నివారణ చర్యలు చేపట్టాలని కోరారు.

చిన్నబగ్గ ఆశ్రమ పాఠశాల సమీపంలో ఏనుగులు



జీడితోటల్లో ఉన్న ఏనుగుల గుంపు

సీతంపేట: మండలంలోని చిన్నబగ్గ గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాల సమీపంలో ఏనుగులు సంచరిస్తున్నట్లు గిరిజనులు తెలిపారు. గోరపాడు కొండల్లో బుధవారం తిష్ఠ వేసిన ఏనుగుల గుంపు కొండ దిగి చిన్నబగ్గవైపు వచ్చి ఆశ్రమపాఠశాలకు కొద్దిదూరంలో ఉన్న జీడితోటల్లో ఘీంకరిస్తున్నాయి. అటువైపు ఎవ్వరూ వెళ్లవద్దని అటవీశాఖ ఎఫ్‌బీవో కె. దాలినాయుడుతో పాటు ట్రాకర్లు సూచిస్తున్నారు.

విద్యార్థుల ప్రవేశాలు మరింత పెరగాలి



రావికర్రివలస గ్రామంలోని పాఠశాలలో రిజిస్టర్లు పరిశీలిస్తున్న కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్

కొమరాడ: గిరిజన సంక్షేమ ప్రభుత్వ ప్రాథమి క పాఠశాలల్లో విద్యార్థుల ప్రవేశాలు గత ఏడా ది కంటే మరింత పెరగాలని కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ ఉపాధ్యాయులతో అన్నారు. ఈ మేర కు గురువారం ఆయన కొమరాడ మండలంలోని అంకుళ్లవలస, రావి కర్రివలస గ్రామాల్లో గల గిరిజన సంక్షేమ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలను ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి అశుతోష్ శ్రీవాస్తవతో కలిసి ఆకస్మికంగా సందర్శించా రు. ఈ సందర్భంగా విద్యార్థుల హాజరు రిజిస్టర్లను పరిశీలించి వారితో ముచ్చటించారు. పాఠశాలలో చేరిన విద్యార్థులకు పౌష్టికాహారంతో పాటు నాణ్యమైన విద్యను అందివ్వాలని ఉపాధ్యాయులకు సూచించారు.

దోమల కాయిల్స్‌తో అనర్థాలు

- మార్కెట్‌లో విచ్చలవిడిగా నాశిరకం బ్రాండ్ల విక్రయాలు
- సహజ పద్ధతులే మేలంటున్న వైద్యులు



దోమలు చంపేందుకు వాడుతున్న కాయిల్స్

పార్వతీపురం: దోమకాటుతో అనారోగ్యానికి గురవుతామన్న భయంతో ముందస్తు జాగ్రత్తల్లో భాగంగా మార్కెట్‌లో లభించే మస్కిటో కాయిల్స్‌ను వాడడం పరిపాటిగా మారింది. మార్కెట్‌లో లభించే మస్కిటో కాయిల్స్‌తో పాటు మస్కిటో అగరబత్తీలను విరివిగా వినియోగిస్తున్నారు. వాటి ద్వారా వచ్చే పొగతో దోమలు రావని భావించి వెలిగిస్తుంటారు. పొగ బయటకు పోకుండా ఇంట్లోని తలుపులన్నీ బిగించి ఈ కాయిల్స్‌ను వెలిగిస్తారు. ఈ పొగలో కార్సినోజెనిక్ రసాయనాలు కలిగిఉండడం వల్ల ఆస్తమా ఉన్న వారికి, చిన్నపిల్లలు, గర్భిణులు, వృద్ధులకు శరీరంలో పలు అనారోగ్య సమస్యలు తలెత్తే అవకాశం ఉంది. నిజానికి మస్కిటో కాయిల్స్ వినియోగం వల్లే కేవలం దోమలు చనిపోవడం లేదు. ఆ పొగ ఉన్నంత సేపు దోమలు సంచరించేందుకు వీలులేక మగతగా ఉండి వాసన తగ్గిన తరువాత అలాగే పొగ ప్రభావం తగ్గిన వెంటనే యథావిధిగా మళ్లీ దోమలు దాడికి పాల్పడతాయి. రోజురోజుకు దోమలు ప్రబలడంతో మార్కెట్‌లోకి నాశిరకం బ్రాండ్లు కూడా వచ్చి ప్రజల ఆరోగ్యాన్ని మరింత ప్రమాదంలోకి నెట్టేస్తున్నాయి.

ప్రకటనలతో మరింత ఆకర్షణగా..

గతంలో రీఫిల్స్‌ను 30, 35, 60 రాత్రులు పనిచేస్తాయంటూ విక్రయించేవారు. ప్రస్తుతం హై, లో ఆప్షన్లతో 45 ఎంఎల్ రీఫిల్స్‌ను విక్రయిస్తున్నారు. వాటిని హైలో పెట్టుకుంటే 10 నుంచి 15 రోజులు వస్తాయి. లో ఆప్షన్‌లో పెడితే 20 నుంచి 25రోజుల వరకు వస్తాయన్న ప్రత్యేకమైన ప్రకటనలతో వినియోగదారులను ఆకట్టుకుంటున్నారు. అయితే ఇది తాత్కాలిక ఉపశమనంగా ఉన్నప్పటికీ ముందుముందు ఆరోగ్యానికి ప్రమాదమేనని వైద్యనిపుణులు హెచ్చరిస్తున్నారు, రీఫిల్స్‌లో ఉండే ప్రాలేత్రిన్, పెర్మేత్రిన్, ట్రాన్స్‌ఫ్లోత్రిన్ వంటి కృత్రిమ కీటక నాశకాలు వెలువడే పొగతో మన శ్వాసకోస వ్యవస్థ మరింత ప్రభావితం అవుతుంది. ఈ రసాయనాలు వాయువులో చేరి ఊపిరితిత్తులను బాధించి ఆస్తమా, బ్రాంకైటీస్ వంటి శ్వాససంబంధిత వ్యాధులకు దారితీసే ప్రమాదం ఎక్కువగా ఉందని పరిశోధనలు సైతం వెల్లడిస్తున్నాయి. ఇప్పటికే పార్వతీపురం, పాలకొండ, కురుపాం పరిసరాలలో ఊపిరితిత్తుల వ్యాధుల బారిన పడుతున్నట్లు వైద్యులు పేర్కొంటున్నారు.

సహజ మార్గాలను ఉపయోగిస్తే మేలు



ప్రజలు ఈ దోమల ప్రభావం నుంచి కాపాడుకునేందుకు కాయిల్స్, రీఫిల్స్ వాడేటప్పుడు అప్రమత్తంగా ఉండాలి. వాడిన తరువాత గదిని బాగా వెంటిలేట్ చేయాలి. ఈ నేపథ్యంలో ఆరోగ్యాన్ని కాపాడుకోవాలంటే రసాయన రీఫిల్స్‌కు బదులు సహజ మార్గాలను ఉపయోగించాలి. నిమ్మ, లవంగం, తులసి వంటి సహజ పదార్థాల ద్వారా దోమలను దూరం చేసే ప్రయత్నాలు అనారోగ్యానికి గురిచేయకుండా మేలుచేస్తాయి. వీలైనంత మేరకు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడంతో పాటు పడుకోవడానికి ఉపయోగించే బెడ్‌షీట్లు ఎండలో ఉంచుతూ శుభ్రం చేసుకోవాలి. కిటికీలు, వెంటిలేషన్స్‌కు మెస్‌ల అమరిక మంచిది. పడుకునే గదిలో గాలి ఆడేలా చూసుకుంటూ అవసరమైతే దోమతెరలు వినియోగించాలి. – డా.ఎస్ఎంకే తిరుమల ప్రసాద్, పీహెచ్‌సీ వైద్యాధికారి, బందలుప్పి

మహిళ ఆత్మహత్యాయత్నం

పార్వతీపురం రూరల్/గరుగుబిల్లి: మండలంలోని గొల్లవానివలసకు చెందిన ఓ మహిళ దీర్ఘకాలిక అనారోగ్య సమస్యలతో బాధపడుతూ మనస్తాపానికి గురై కన్నవారి ఊరు పార్వతీపురం మండలం లక్ష్మీనారాయణపురంలో గడ్డిమందు తాగి గురువారం ఆత్మహత్యాయత్నం చేసింది. ఈ విషయాన్ని గుర్తించిన కుటుంబసభ్యులు హుటాహుటిన పార్వతీపురం జిల్లా కేంద్రాస్పత్రికి తరలించగా చికిత్స పొందుతున్నట్లు అవుట్‌పోస్టు ఏఎస్సై ఎస్. భాస్కరరావు తెలిపారు. ఈ మేరకు వివరాలు సేకరిస్తున్నామన్నారు.

పీఎస్‌ల హేతుబద్ధీకరణకు సలహాలివ్వండి



మాట్లాడుతున్న డీఆర్ఓ కె.హేమలత

పార్వతీపురం టౌన్: జిల్లాలోని పోలింగ్ స్టేషన్ల హేతుబద్ధీకరణకు తగిన సలహాలు ఇవ్వాలని జిల్లా రెవెన్యూ అధికారి కె.హేమలత గుర్తింపు పొందిన రాజకీయ పక్షాల ప్రతినిధులను కోరా రు. అలాగే ఆరోగ్యకరమైన ఓటర్ల జాబితాను తయారు చేయడంలో బీఎల్ఓలతో సహకరించాలని పిలుపునిచ్చారు. ఈ మేరకు గురువా రం ఆమె తన చాంబర్‌లో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతి నెలా డీఈఓ లేదా ఈఆర్ఓ స్థాయిలో సమావేశాలను నిర్వహించాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ఆదేశించినట్లు తెలిపారు. ఈ విషయమై ఈసీ జారీ చేసే నియమాలు, మార్గదర్శకాలపై తగిన సలహాలను జిల్లాలోని అన్ని రాజకీయ పార్టీల నుంచి కోరుతున్నట్లు ఆమె చెప్పారు. ఆరోగ్యకరమైన ఓటర్ల జాబితా ను తయారు చేయడంలో బీఎల్ఓలకు సహకరించాలని, ఇందుకు గుర్తింపు పొందిన రాజకీ య పార్టీలు ప్రతి పోలింగ్ స్టేషన్‌కు బూత్ లెవె ల్ ఏజెంట్‌ను నియమించాలని సూచించారు.